నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 | NIZAMABAD



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి (చిత్రంలో) నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు

# 'స్థానిక' ఎన్నికల్లో కాంగ్రెస్‌కు జీరో..

- ఎక్కడికెళ్లినా కారు రావాలి.. కేసీఆర్ కావాలంటున్న ప్రజలు
- రాష్ట్రంలో జరగాల్సింది రీసర్వే కాదు.. రీపోలింగ్
- ఎలక్షన్ ఎప్పుడు జరిగినా ప్రజల సెలక్షన్ కేసీఆర్
- బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 13 : స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీకి జీరో వస్తుందని బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్ నాయకులను గ్రామపొలిమేరల్లోకి రాకుండా తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి పోటీ చేసినా వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ విజయాన్ని అడ్డుకోలేరని స్పష్టంచేశారు. రాష్ట్రం లో ఎక్కడికెళ్లినా కారు రావాలి, కేసీఆర్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రీసర్వేలు, వాయిదాల పద్ధతి లేకుండా ఏ పథకాన్ని సక్రమంగా అమ లు చేయడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఇప్పుడు జరగాల్సింది రీసర్వే కాదని, రీపోలింగ్ అని స్పష్టం చేశారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజల సెలక్షన్ కేసీఆరేనని, రేవంత్‌రెడ్డిని ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఇద్దరూ ఐరన్‌లెగ్‌లేనని, వారెక్కడ కాలు పెడితే అక్కడ కాంగ్రెస్ బుగ్గి పాలై బొగ్గుగా మారుతుందని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి పాదమహిమతో ఇప్పటికే సగానికిపైగా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పత్తా లేకుండా పోయిందన్నారు. ఇటీవల కేరళ వెళ్లిన సందర్భంగా హర్యానాలో కాంగ్రెస్‌ను ఓడించిన ఆప్‌ను ఢిల్లీలో కాంగ్రెస్ ఓడించిందని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మేధస్సు చూసి కాంగ్రెస్ అధిష్టానమే నివ్వెరపోయిందన్నారు. మహారాష్ట్రలో మూడు ప్రధాన పార్టీలతో కలిసి పోటీ చేసినా కాంగ్రెస్ ఎందు కు ఘోరంగా ఓడిపోయిందో రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు పాల్గొన్నారు.

**సుస్థిర పాలన అందించిన కేసీఆర్**

కేసీఆర్ రాష్ట్రానికి సుస్థిర పాలన అందిస్తే రేవంత్ రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిగా చేస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఉద్దెర బేరగాడని ప్రజలు చెప్పుకుంటున్నారన్నారు. కొర్రీలు, వాయిదాల పద్ధతి లేకుం డా ఏ పథకం అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. గతంలో కేసీఆర్ మాటిస్తే అది అప్పటికప్పుడే అమలయ్యే పరిస్థితి ఉండేదన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం ప్రజలను మోసగించడంలో ఆరితేరిన చెయ్యి అని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ పేరు చెప్పి గద్దెనెక్కిన ఈ డూప్లికేట్ గాంధీలు ఇచ్చిన దొంగ హామీలు, వైఫల్యాలను ప్రజలు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. దశాబ్దాల పాటు కన్నీటి పాలైన తెలంగాణ బిడ్డలు మళ్లీ అవే కష్టాలు, అవే కన్నీళ్లలో చిక్కుకుని విలవిలలాడుతున్నారని పేర్కొన్నారు. తలకిందులుగా తపస్సు చేసినా రేవంత్‌ను ఇక తెలంగాణ ప్రజలు నమ్మరని అన్నారు.

రాహుల్‌గాంధీకి రైఫిల్‌రెడ్డి బాగోతాలన్నీ తెలిసిపోయాయని, అందుకే రేవంత్ మొహం చూడడానికి కూడా ఆయన ఇష్టపడడం లేదన్నారు. సీఎం 32సార్లు ఢిల్లీకి వెళ్లినా రేవంత్‌కు రాహుల్ అపాయింట్‌మెంట్ దొరకలేదన్నారు. తాజాగా కుల గణన రిపోర్టు పట్టుకెళ్లినా రేవంత్‌ను కాంగ్రెస్ అధిష్టానం పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. ఆరు హామీలపై ప్రశ్నిస్తారనే భయంతోపాటు రేవంత్ మొహం చూడడం ఇష్టం లేకనే రాహుల్ వరంగల్ పర్యటన రద్దు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. వరంగల్ రైతు డిక్లరేషన్ అమలుచేయకపోవడం, రుణమాఫీ, రైతు భరోసా, పెన్షన్లు, తులం బంగారం, ప్రతి మహిళకూ రూ.2500 వంటి ఆరు ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలుచేయకపోవడంపై ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందనే భయంతో రాహుల్‌గాంధీ తెలంగాణకు రావడానికి జంకుతున్నారని విమర్శించారు. రాహుల్‌గాంధీ తీరును చూసి సీఎంను మార్చడానికే ఇదంతా అని కాంగ్రెస్‌లో గుసగుసలు మొదలైనట్లు తెలిపారు. కాంగ్రెస్‌లో మళ్లీ అదే ముఠాల సంస్కృతి రాజుకుంటున్నదని ఆరోపించారు. భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వంటి నేతలు ఎవరికి వారే గుంపులుగా విడిపోయి ఢిల్లీలో సీఎం పదవి కోసం పైరవీలు చేసుకుంటూ పాలనను గాలికొదిలేశారని జీవన్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



# రైతు భరోసా అరకొరే..




- రెండెకరాలకు వచ్చింది రూ.7 వేలే
- రేవంత్ సర్కారుపై రైతుల గుస్సా
- ఇప్పటికే మూడుసార్లు రైతుబంధు ఎగవేత
- సర్వేలో తప్పులు.. కర్షకులకు తిప్పలు



*ఈయన పేరు గైని పోశెట్టి. రుద్రూర్ మండలం చిక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు. తనకున్న 2.01 ఎకరాల భూమిలో పంటలు సాగు చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల రెండెకరాల లోపు ఉన్న రైతులకు రైతుభరోసా నిధులు విడుదల చేసింది. ఎకరాకు రూ.6 వేల చొప్పున పోశెట్టికి రూ.12 వేలు రావాల్సి ఉండగా, ఖాతాలో రూ.7,050 మాత్రమే జమ అయ్యాయి. ఆందోళన చెందిన రైతు అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.*

రుద్రూర్, ఫిబ్రవరి 13: రేవంత్ సర్కారు రైతులతో చెలగాటమాడుతున్నది. రుణమాఫీ, బోనస్ హామీలే కాదు, రైతుభరోసా విషయంలోనూ మోసం చేస్తున్నది. అరకొరగా నిధులు ఇస్తూ అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లుతున్నది. ఒక్కో సీజ్‌లో ఎకరాకు రూ.7500 చొప్పున ఎన్ని ఎకరాల భూమి ఉంటే అంత మొత్తం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందర ఊదరగొట్టింది. తీరా గద్దెనెక్కాక రైతుభరోసా పథకంలో అనేక నిబంధనలను విధించింది. సాగు చేసిన భూములకే అంటూ షరతులు పెట్టింది. ఇక, రెండు సీజన్లలో కలిపి ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతుభరోసా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్.. దాన్ని రూ.12 వేలకే పరిమితం చేసింది. అదన్న సక్కగా ఇవ్వకుండా రైతులను సతాయిస్తున్నది. ఎంత భూమి సాగులో ఉంటే అంత మొత్తం పెట్టుబడి సాయం చేయకుండా అరకొరగా విధిస్తుండడంపై రైతులు మండిపడుతున్నారు. సాంకేతిక తప్పిదాలను తెరపైకి తెచ్చి తమ నోట్లో మట్టి కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గైని పోశెట్టి పేరున ఉన్న రెండెకరాల భూమి

రైతుభరోసా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూటకో మాట మాట్లాడుతూ రైతాంగాన్ని వంచిస్తున్నది. రైతుబంధు స్థానంలో రైతుభరోసా పేరుతో ఎకరాకు ఏటా రూ.15 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ అమలులో పూర్తిగా విఫలమైంది. ఇప్పటికే మూడు సీజన్లకు సంబంధించి పెట్టుబడి సాయాన్ని రేవంత్ సర్కారు ఎగ్గొట్టింది. కేసీఆర్ హయాంలో పంట వేసే సమయంలోనే పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ అయ్యేది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుబంధు ఆగిపోయింది. రైతుభరోసా అమలు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. సాగులో ఉన్న భూములకే అని మాట తప్పారు. ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి దాన్ని రూ.12 వేలకు పరిమితం చేశారు. జనవరి 26న రైతుభరోసా నిధులు జమ చేస్తామని గొప్పగా ప్రకటించారు. తీరా మార్చి 31 లోపు ఇస్తామని మరింత గడువు పొడిగించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండెకరాల లోపు ఉన్న భూములకు పెట్టుబడి సాయం విడుదల చేశామని ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. కానీ, అది కూడా సరిగా ఇవ్వకుండా రైతులను దగా చేసింది. ఒక రైతుకు రెండు ఎకరాల భూమి ఉంటే రూ.12 వేలు ఖాతాలో జమ చేయాల్సి ఉండగా, అరకొరకగా చేసి చేతులు దులుపుకుంటున్నది. దీంతో రైతులు సర్కారు తీరుపై నిప్పులు చెరుగుతున్నారు. రైతుభరోసా ఇచ్చేదే ఆలస్యం. అది కూడా పూర్తిగా ఇవ్వకుండా ఇలా మోసం చేయడం సరి కాదని విమర్శిస్తున్నారు.

## ఎగవేతల సర్కారు

అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ అలవి కానీ హామీలు అనేకం ఇచ్చింది. రైతులు, మహిళలు, నిరుద్యోగులు.. ఇలా అన్ని వర్గాలపైనా వరాల జల్లు కురిపించింది. అనేక హామీలతో ప్రధానంగా రైతులను మభ్యపెట్టింది. 2023 డిసెంబర్ 9వ తేదీన రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, పంట రుణాలు లేని రైతులు వెంటనే రుణాలు తెచ్చుకోవాలని ఉసిగొల్పింది. కానీ 15 నెలలు గడుస్తున్నా సగం మంది రైతులకు ఇప్పటికీ రుణ మాఫీ చేయలేదు. ఇక, అన్ని పంటలకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అమలువిషయంలో వెనుకడుగు వేసింది. సన్న వడ్లకే బోనస్ అంటూ రైతులను దారుణంగా మోసం చేసింది. మూడు నెలల క్రితం కొనుగోలు చేసిన సన్నవడ్లకు ఇప్పటికీ బోనస్ ఇవ్వకుండా రేవంత్ సర్కారు కర్షకులను కన్నీరు పెట్టిస్తున్నది.

# 'ఫైనాన్స్' వేధింపులు భరించలేక యువకుడి ఆత్మహత్య

భిక్కనూరు, ఫిబ్రవరి 13: ఒకవైపు ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు ఫైనాన్స్ నుంచి వేధింపులు భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, స్థానిక ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన పుల్లూరి బాబు (35) ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల ఇంటి మరమ్మతులతోపాటు ఇతర అవసరాల కోసం ఫైనాన్స్‌లో లోన్ తీసుకున్నాడు. కిస్తులు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ ప్రతినిధులు డబ్బులు కట్టాలని గొడవ చేశారు. ఫైనాన్స్ వారి వేధింపులకు తోడు అప్పులు కూడా ఎక్కువయ్యాయి. దీంతో ఆర్థిక ఇబ్బందులను భరించలేక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


పుల్లూరి బాబు (ఫైల్)

# దరఖాస్తులతోనే సరి..

- పూటకో మాట చెబుతూ సర్కారు పిల్లిమొగ్గలు
- కొత్తవి ఇచ్చిందీ లేదు.. పాత వాటిలో మార్పులు చేసిందీ లేదు
- ప్రజల నుంచి అప్లికేషన్లు తీసుకోవడానికే పరిమితం
- ఇప్పటికే ప్రజాపాలన, గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ
- ఇప్పుడు మీసేవా సెంటర్ల ద్వారా అప్లికేషన్లకు అవకాశం
- ఎన్నిసార్లు అప్లై చేసినా ఫలితం లేదని లబ్ధిదారుల ఆవేదన

**రేషన్ కార్డుల కోసం జనం అవస్థలు**

చందూర్, ఫిబ్రవరి 13: రేషన్ కార్డుల జారీ విషయంలో రేవంత్ ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేస్తున్నది. కొత్త కార్డులు ఇచ్చిందీ లేదు.. పాత వాటిలో మార్పులు చేసిందీ లేదు. కేవలం దరఖాస్తుల స్వీకరణకే పరిమితమవుతున్నది. తాజాగా మీసేవ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో జనం అటువైపు పరుగులు పెడుతున్నారు. పనులు మానుకుని పొద్దంతా పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు ప్రజాపాలన దరఖాస్తుల సమయంలో, గ్రామసభల్లో అప్లికేషన్లు పెట్టుకున్నారు. పలుమార్లు అప్లై చేసినా ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. దీంతో జనం కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ఆ పార్టీ నేతలు ఎన్నికల ముందు ఊదరగొట్టారు. 15 నెలలు దాటుతున్నా కొత్త కార్డులు మాత్రం ఇవ్వలేదు. పైగా ప్రజల నుంచి తరచూ అప్లికేషన్లు తీసుకుంటూ చివరకు వారి ఆశలపై నీళ్లు చల్లుతున్నారు.



## పనులు వదులుకొని..మీ సేవ కేంద్రాల వద్ద బారులు

రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది. ఇందుకోసం ప్రజాపాలన, గ్రామసభలు ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించింది. కానీ సదరు దరఖాస్తులను పరిశీలించి దాఖాలాలు లేవనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సంబంధిత మంత్రి రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని చెప్పినా..ఇప్పటి వరకూ ఒక్క రేషన్‌కార్డు జారీ చేయకపోవడం గమనార్హం. కొత్త రేషన్ కార్డు, మార్పులు, చేర్పులతోపాటు సవరణల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఇటీవల ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీంతో పౌర సరఫరాల శాఖ, మీ సేవ కేంద్రాలకు ప్రజలు పరుగులు తీస్తున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారు. పనులన్నీ వదులకొని ఉదయం నుంచే బారులు తీరుతున్నారు

## దరఖాస్తులు ఫుల్.. కార్డుల జారీ నిల్

రేషన్ కార్డు వస్తదేమోననే ఆశతో కొందరు పలు దఫాలుగా దరఖాస్తు చేసుకుంటున్నారు. దరఖాస్తులతోపాటు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను జతచేస్తున్నారు. త్వరలో రేషన్‌కార్డులను జారీ చేస్తామని ప్రభుత్వం, సంబంధిత మంత్రి ప్రకటించిన ప్రతిసారి తాము దరఖాస్తు చేసుకుంటున్నా, ప్రయోజనం లేకుండా పోతున్నదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. గతంలో రేషన్ కార్డు కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే ఫీల్డ్ వెరిఫికేషన్ నుంచి మొదలుకొని డీఎస్‌వో వరకు ఆన్‌లైన్‌లో స్టేటస్ అందుబాటులో ఉంచేవారు. సివిల్‌సప్లయ్ వెబ్‌సైట్‌లో కూడా తెలుసుకునే అవకాశం ఉండేది. ఒక్కసారి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే మళ్లీ అప్లయ్ చేసుకోవడానికి అవకాశం ఉండేదికాదు. దీంతో స్టేటస్ రూపంలో మాత్రమే రేషన్‌కార్డు మంజూరు జారీ ప్రక్రియను తెలుసుకునేవారమని పలువురు గుర్తుచేసుకుంటున్నారు.

## అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

ప్రజాపాలన, గ్రామసభల్లో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ప్రభుత్వ అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తున్నది. ఎప్పుడు మంజూరుచేస్తారని దరఖాస్తుదారులు అడిగితే సమాధానం చెప్పేవారే కరువయ్యారు.అసలు రేషన్ కార్డులు ఇస్తారా..ఇస్తే ఎప్పుడు ఇస్తారు..లేదా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెబుతారా..ఇంకెన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలి..ఇలాగా ఆఫీసు చుట్టూ తిరగాల అంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రేషన్‌కార్డుల మంజూరుపై కనీసం స్టేటస్ అయినా చెప్పాలని కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ నుంచి దఫదఫాలుగా దరఖాస్తులు తీసుకోవడమే తప్ప, రేషన్‌కార్డులు ఇచ్చిందిలేదు..సచ్చిందిలేదంటూ నిట్టూరుస్తున్నారు.

# అధి'కారుల' చలాన్లు



కామారెడ్డి, ఫిబ్రవరి 13: జిల్లా అదనపు కలెక్టర్ల కార్లపై పెండింగ్ చలాన్లు ఉన్నాయి. గతేడాది ఫిబ్రవరి నుంచి ఈ చలాన్లు పెండింగ్‌లో ఉన్నా, ఇంతవరకు చెల్లించలేదు. టీఎస్ 17 సీ 7299 నంబర్ గల కారుపై రూ. 4,140, టీఎస్ 09 ఎఫ్‌ఆర్ 8,218 కారుపై రూ.3,105 జరిమానా విధించారు. ఈ చలాన్లు ఓవర్ స్పీడింగ్, డేంజరస్ డ్రైవింగ్‌కు సంబంధించినవి కావడం గమనార్హం. అధికారులే చలాన్లు కట్టకపోతే సామాన్యులు ఎలా కడతారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

# మార్కెట్ యార్డులో ఇంటి దొంగలు

- పుసుపు చోరీ చేసి విక్రయం
- గుర్తించి, సస్పెండ్ చేసిన అధికారులు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 13 : జిల్లాకేంద్రంలోని మార్కెట్‌యార్డుకు ఈ సీజన్‌లో పసుపు పంట అధికంగా రావడంతో అందులో పనిచేస్తున్న వారే చేతివాటం ప్రదర్శించారు. యార్డులో పనిచేస్తున్న వ్యక్తులు కాసులకు కక్కుర్తిపడి.. పసుపును కాజేసి, యార్డులో పనిచేస్తున్న వారికే విక్రయించడంతో దొరికిపోయారు. దీంతో అధికారులు విచారణ చేపట్టి, వారిని గుర్తించి సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచడం గమనార్హం.



పల్లెప్రకృతి వనాన్ని శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది




చెట్లకు నీళ్లు పడుతున్న జీపీ కార్మికుడు

# పరిశుభ్రంగా మారిన పల్లెప్రకృతి వనం

**నమస్తే తెలంగాణ ఎఫెక్ట్**

ధర్పల్లి, ఫిబ్రవరి 13 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామస్తులకు ఆహ్లాదం పంచేందుకు మండల కేంద్రంలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. పచ్చదనం కళకళలాడిన ప్రకృతి వనంగా ఏడాది కాలంగా నిర్వహణ కరువై అధ్వానంగా మారింది. పట్టించుకునేవారే కరువయ్యారు. ప్రకృతి వనం చెత్తాచెదారంతో నిండిపోయింది. దీనిపై నమస్తే తెలంగాణ దినపత్రికలో 'నాడు ఆహ్లాదకరం – నేడు కళావిహీనం' అనే శీర్షికన గురువారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు పల్లెప్రకృతి వనాన్ని సందర్శించారు. సిబ్బందితో కలిసి పల్లెప్రకృతి వనంలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించి ట్యాంకర్ ద్వారా చెట్లు, మొక్కలకు నీళ్లు పట్టించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పర్యవేక్షించి పల్లె ప్రకృతి వనాన్ని మళ్లీ సుందరవనంగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టారు